## క్లుప్తంగా

### పర్ణశాల ఆలయంలో సంప్రోక్షణ

**దుమ్ముగూడెం:** మండలంలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన పర్ణశాల సీతారామచంద్రస్వామి ఆలయంలో ఆదివారం అర్చకులు సంప్రోక్షణ చేశారు. పర్ణశాల గ్రామంలోని ఆలయం దగ్గరలో ఓ గ్రామస్తుడు మృతి చెందడంతో ఆలయాన్ని సంప్రదాయాల ప్రకారం ఉదయం నుంచి సాయంత్రం వరకు మూసివేశారు. అనంతరం ఆలయంలో సంప్రోక్షణ చేసి స్వామి వారి అభిషేకాలు నిర్వహించారు.

### నిధుల మంజూరుపై హర్షం

**మణుగూరురూరల్:** మండల కేంద్రంలోని అంబేడ్కర్ సెంటర్‌లో అసంపూర్తిగా ఉన్న పోలీస్ స్టేషన్ భవన నిర్మాణానికి పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు నిధులు మంజూరు చేయించడంపై కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు పీరినాకి నవీన్ ఆదివారం ఓ ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. స్టేషన్ భవన నిర్మాణానికి నిధులు కేటాయించాలని ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు సీఎం రేవంత్‌రెడ్డిని కోరారని, స్పందించిన సీఎం వెంటనే రూ.కోటి 50లక్షలు మంజూరు చేశారని తెలిపారు. నిధులు మంజూరు చేసిన సీఎం రేవంత్‌రెడ్డికి, కృషి చేసిన ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లుకు కాంగ్రెస్ పార్టీ, ప్రజల పక్షాన ఆయన ధన్యవాదాలు తెలిపారు.

### ముస్లిం కమిటీ సదర్‌గా వలీపాషా



**అశ్వారావుపేటరూరల్:** అశ్వారావుపేట ముస్లిం కమిటీ సదర్ నూతన కమిటీని ఆదివారం ఎన్నుకున్నారు. స్థానిక మసీద్‌లో జరిగిన సమావేశంలో కమిటీ సదర్‌గా (అధ్యక్షుడిగా) ఎస్‌కె.వలీపాషా, కార్యదర్శులుగా ఎండి.నజీర్, ఎస్‌కే.సర్దార్, సహాయ కార్యదర్శులుగా ఎస్‌కె.యాఖుబ్, ఎస్‌కె.రహేమత్, కోశాధికారిగా ఎస్‌కె.జాన్ పాషాతోపాటు మరికొంత మందిని కమిటీ సభ్యులుగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతన సదర్ మాట్లాడుతూ.. తనపై నమ్మకంతో ఏకగ్రీవంగా అవకాశం కల్పించారని, మసీదులను అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తానని తెలిపారు.

### డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు

**అశ్వాపురం:** మద్యం సేవించి వాహనాలు నడిపితే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై తిరుపతిరావు అన్నారు. మండల కేంద్రంలో బస్టాండ్ సెంటర్‌లో ఆదివారం రాత్రి ఎస్సై తిరుపతిరావు ఆధ్వర్యంలో పోలీసులు వాహనాల తనిఖీల్లో నిర్వహించారు. ఇందులో భాగంగా డ్రంక్ అండ్ డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై తిరుపతిరావు మాట్లాడుతూ.. మద్యం సేవించి వాహనాలు నడిపితే ప్రమాదాలు జరుగుతాయన్నారు. వాహనదారులు అన్ని ధ్రువపత్రాలు కలిగి ఉండాలన్నారు.

### 'సనాతన ధర్మాన్ని కాపాడుకోవాలి'

**బూర్గంపాడు:** సనాతన హిందు ధర్మాన్ని పరిరక్షించుకోవాల్సిన ఆవశ్యకత ఉందని సారపాకలోని గాయత్రి జ్యోతిష్య కేంద్రం వ్యవస్థాపకుడు దేవులపల్లి సాయికిరణ్‌శర్మ అన్నారు. సనాతన ధర్మం, పురాణాలపై ఆదివారం నిర్వహించిన క్విజ్ పోటీల్లో విజేతలకు ఆయన బహుమతులను అందజేసి మాట్లాడారు. ఈ క్విజ్ పోటీల్లో రేపాక అనూషకు ప్రథమ బహుమతి, ముత్తవరపు రాజశేఖర్‌కు ద్వితీయ బహుమతులను అందజేశారు. పోటీలో పాల్గొన్నవారికి కన్సోలేషన్ బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో పరుశురాం పరివార్, హిందు సంస్థల సభ్యులు కల్యాణ్,హనుమంతు తదితరులు పాల్గొన్నారు.

### కుట్రపూరిత రాజకీయాలు

**గుండాల:** మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఇళ్లు, కారాలయాలపై 16 చోట్ల ఈడీ దాడులు చేయడం రాజకీయ కుట్రలో భాగమేనని, ఇటువంటి హేయమైన చర్యలకు పాల్పడటం బీజేపీకి కొత్తేమీ కాదని మండల పీఎస్ఆర్ పీవీఆర్ కోఆర్డినేటర్ ఎస్‌కె.ఖదీర్ ఆదివారం ఓ ప్రకటనలో ఖండించారు. మాట వినని నాయకులపై అస్త్రాలు ప్రయోగిస్తూ దారికి తెచ్చుకోవడం కోసం సీబీఐ, ఈడీ వ్యవస్థలను వాడుకోవటం సిగ్గుచేటన్నారు. ప్రజానాయకుడు పొంగులేటి శీనన్నను టార్గెట్ చేసి సాధించేదేమి ఉండదని తెలిపారు. ఇటువంటి కుట్రపూరిత పరిణామాలను ఖండిస్తున్నామని మండిపడ్డారు.

### 'డబుల్' ఇళ్లు అందించాలి

**భద్రాచలంఅర్బన్:** భద్రాచలం పట్టణంలో నిర్మాణం పూర్తయిన డబుల్ బెడ్రూం ఇళ్లను తి పెదవాడికి అందజేయాలని సీపీఎం భద్రాచలం పట్టణ కార్యదర్శి గడ్డం స్వామి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పార్టీ కోర్రాజులగుట్ట, డబుల్ బెడ్రూం (కేసీఆర్ కాలనీ) కొమరం భీమ్ శాఖ మహాసభలు సోమవారం ప్రారంభం కాగా.. కార్యక్రమంలో పాల్గొన్న స్వామి మాట్లాడారు. పాలకులు డబుల్ బెడ్రూం ఇళ్ల నిర్మాణంలో జాప్యం చేస్తున్నారని విమర్శించారు. అనంతరం అంబసత్రం శాఖా మహాసభలో పాల్గొన్న సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు మచ్చ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. భద్రాచల పట్టణ అభివృద్ధికి ప్రభుత్వం వెంటనే నిధులు కేటాయించాలని, డంపింగ్ యార్డ్ నిర్మాణం త్వరితగతిన పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. మహాసభల్లో పార్టీ పట్టణ కమిటీ సభ్యులు, శాఖ కార్యదర్శులు, పార్టీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# తొలగింపు తూతూ మంత్రమే!

- కోనో కార్పస్ చెట్ల నరికివేతలో నిర్లక్ష్యం
- పలుచోట్ల అలానే ఉండిపోయిన మొక్కలు
- ఉన్నతాధికారులు ఆదేశించినా కదలని మున్సిపల్ యంత్రాంగం



పాత మణుగూరు వెళ్లే దారిలో అలానే ఉన్న కోనోకార్పస్ మొక్కలు



జీఎం ఆఫీస్ పరిసర ప్రాంతంలో తొలగించని కోనోకార్పస్ మొక్కలు

**మణుగూరుటౌన్:** మున్సిపాలిటీ అధికారుల నిర్లక్ష్యం ప్రజల పాలిట శాపంగా మారుతోంది. ప్రజారోగ్యానికి ప్రమాదకరంగా మారిన కోనోకార్పస్ మొక్కలు తొలిగించాలని జిల్లా కలెక్టర్ ఆదేశాలిచ్చినా మున్సిపాలిటీ అధికారులు తూతూ మంత్రంగా పనులు నిర్వహించి చేతులు దులుపుకున్నారనే ప్రజలు ఆరోపిస్తున్నారు. పట్టణంలోని ప్రధాన రహదారి డివైడర్‌పై ఉన్న మొక్కలు యుద్ధప్రాతిపదికన తొలిగించిన మున్సిపాలిటీ అధికారులు.. పట్టణంలోని పట్టణ ప్రగతిలో భాగంగా పార్కులు, రోడ్లకు ఇరువైపులా, సింగరేణి పరిసర ప్రాంతాల్లో నాటిన మొక్కలు అలానే వదిలేశారు.

వేగంగా పెరిగే ఈ మొక్క శ్వాసకోశ వ్యాధులకు గురి చేయడంతో పాటు ప్రజలకు హానీ చేస్తోందనే కారణంతో ప్రభుత్వం తొలిగించాలని ఆదేశించింది. శివలింగాపురం రోడ్డుతో పాటు చాపల మార్కెట్ నుంచి పాత మణుగూరుకు వెళ్లే దారికిరువైపులా నాటిన కోనోకార్పస్ ఏపుగా పెరిగి దర్శనమిస్తున్నాయి. ప్రభుత్వ పాఠశాల సమీపంలో పట్టణ పార్కుల్లో శ్మశాన వాటికల వద్ద నాటిన మొక్కలు తొలిగించకుండా అలానే వదిలేయడం పట్ల మండల, మున్సిపాలిటీ ప్రజల నుంచి తీవ్ర అసంతృప్తి వ్యక్తమవుతోంది. సింగరేణి పరిసర ప్రాంతాల్లోనూ ఈ మొక్కలు అలానే ఉండడంతో కార్మికులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ప్రజారోగ్యం పట్ల అధికారులు చూపుతున్న శ్రద్ధను చూసి నోరెళ్లబెడుతున్నారు. ధికారుల నిర్లక్ష్యాన్ని ఎత్తి చూపుతున్నారు.

### వెంటనే తొలగించాలి



ప్రాణాంతకమైన కోనో కార్పస్ మొక్కలు తొలగించాలని ప్రభుత్వం ఆదేశించినప్పటికీ మున్సిపాలిటీ అధికారులు డివైడర్ల మధ్యన తొలిగించి చేతులు దులుపుకున్నారు. ప్రజలు అనారోగ్యానికి కారణమౌతున్నారు. వెంటనే పట్టణ ప్రగతిలో భాగంగా నాటిన వేలాది మొక్కలతో పాటు అక్కడక్కడా రోడ్లకిరువైపులా ఉన్న మొక్కలు తొలిగించే విధంగా చర్యలు తీసుకోవాలి. ప్రజారోగ్యాన్ని సైతం నిర్లక్ష్యం చేస్తూ ఉన్నతాధికారుల ఆదేశాలు పాటించని అధికారులపై చర్యలు తీసుకోవాలి.

– దుర్గ్యాల సుధాకర్, సీపీఐ పట్టణ కార్యదర్శి

# ఇష్టపడి చదివితే ఉజ్వల భవిష్యత్



వేడుకల్లో నృత్యాలు చేస్తున్న విద్యార్థినులు

**అశ్వారావుపేటరూరల్:** ప్రతి విద్యార్థీ ఇష్టపడి చదవాలని, ఉన్నత లక్ష్యంతో ముందుకు వెళ్లాలని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ వి.స్పందన అన్నారు. ఆదివారం మండలంలోని పెదవాగు ప్రాజెక్టు గ్రామంలోని గిరిజన గురుకుల బాలికల డిగ్రీ కళాశాలలో ఫ్రెషర్స్‌డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ.. ఉన్నత విద్యను ప్రభుత్వం ఉచితంగా అన్ని సౌకర్యాలతో అందిస్తుందని, వాటిని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. విద్యతోపాటు, ఇతర రంగాల్లో కూడా రాణించే విధంగా ఉండాలన్నారు. అనంతరం విద్యార్థినులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు, నృత్యాలు ఆకట్టుకున్నాయి.

# ధర్మ ప్రచార సభ నూతన కమిటీ ఎన్నిక

**మణుగూరురూరల్:** మండలంలోని గుట్టమల్లారంలో ఉన్న వేదగాయత్రిదేవి ఆలయ ప్రాంగణంలో అఖిల భారతీయ అయ్యప్ప ధర్మప్రచార సభ రాష్ట్ర కార్యవర్గ సమావేశం ఆదివారం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా జాతీయ ప్రధాన కార్యదర్శి బేతి తిరుమల్ రావు హాజరై మాట్లాడారు. నవంబర్ 15వ తేదీ నుంచి జనవరి 15వ తేదీ వరకు అయ్యప్పమాలధారణ కాలం కావడంతో ఎరుమేలి, ఫలణి, నారాయణతోడ, శెంగొట్టాయి ప్రాంతాల్లో సంస్థ ఆధ్వర్యంలో అయ్యప్ప మాలధారులకు నిత్య అన్నదాన కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. అనంతరం అయ్యప్ప ధర్మ ప్రచార సభ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా నూతన కమిటీని ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా పోతురాజు వెంకటరావు, జిల్లా కార్యదర్శిగా నల్లపాటి సత్యనారాయణ, జిల్లా కోశాధికారిగా గుమ్మడివెల్లి శ్రీనివాసరావులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అఖిల భారతీయ అయ్యప్ప ధర్మప్రచార సభ రాష్ట్ర అధ్యక్షులు టివి పుల్లారావు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో రాష్ట్ర కార్యదర్శి కర్కా సిద్ధు, కోశాధికారి మూడు శ్రీనివాస్ ఉగప్పా, జాతీయ కార్యదర్శి శిరిశెట్టి శ్రీనివాస్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు మట్టపల్లి సంపత్‌కుమార్, సహాయ కార్యదర్శి దుశెట్టి భాస్కర్, ఢిల్లీ ఏడుకొండలు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు తెల్లాకుల కృష్ణ, రాష్ట్ర వాలంటరీ కమాండెంట్ తదితరులు పాల్గొన్నారు.

### మండలంలో నేడు ఎమ్మెల్యే పర్యటన

**కరకగూడెం:** నేడు కరకగూడెం మండలంలో ఉదయం 10గంటల నుంచి పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు పర్యటిస్తున్నట్లు ఇన్‌చార్జ్ ఎంపీడీఓ కుమార్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. చొప్పాల, కరకగూడెం, తాటిగూడెం, వట్టంవరిగుంపు, చిరుమళ్ల గ్రామ పంచాయతీల పరిధిలోని పలు గ్రామాల్లో సీసీ రోడ్లను ప్రారంభిస్తారని తెలిపారు. నిర్మాణం పూర్తయిన చిరుమళ్ల, వట్టంవరిగుంపుల నూతన గ్రామ పంచాయతీ భవనాలను సైతం ప్రారంభించనున్నట్లు పేర్కొన్నారు. ఆపై అధికారులతో రివ్యూ మీటింగ్ ఉంటుందని, అన్ని శాఖల అధికారులు తమ రిపోర్టులతో సకాలంలో హాజరుకావాలని అన్నారు.

### జాతీయ స్థాయిలో రాణించాలి



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న ఎమ్మెల్యే జారే ఆదినారాయణ

**దమ్మపేట:** విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో కూడా జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించాలని స్థానిక ఎమ్మెల్యే జారే ఆదినారాయణ ఆకాంక్షించారు. ఆదివారం మండలంలోని పార్కలగండి ఆశ్రమ పాఠశాలలో భద్రాచలం ఐటీడీఏ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జోనల్ స్థాయి క్రీడా పోటీలను ఎమ్మెల్యే ప్రారంభించారు. క్రీడాకారులను పరిచయం చేసుకుని, వారితో కాసేపు ముచ్చటించారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ నాయకులు, హెచ్ఎంలు, వ్యాయామ ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

### తక్షణమే రుణమాఫీ చేయాలి

**ములకలపల్లి:** అర్హులందరికీ తక్షణమే రూ.రెండు లక్షల రుణమాఫీ చేయాలని సీపీఎం మండల కార్యదర్శి ముదిగొండ రాంబాబు డిమాండ్ చేశారు. వీకే.రామవరంలో ఆదివారం నిర్వహించిన పార్టీ గ్రామశాఖ సమావేశంలో పాల్గొన్న ఆయన మాట్లాడారు. ఎన్నికల హామీ మేరకు రైతు ఖాతాల్లో నగదు జమ చేయాలని అన్నారు. సమావేశంలో మాజీ ఎంపీటీసీ పొడియం వెంకటేశ్వర్లు, ఊకంటి రవికుమార్, గౌరి నాగేశ్వరరావు, మాలోతు రావూజా, మాజీ సర్పంచ్ కుంజా భాస్కర్, సోయం కృష్ణ, పొడియం రామ్మూర్తి తదితరులు పాల్గొన్నారు.

### తక్షణమే రుణమాఫీ చేయాలి

**ములకలపల్లి:** అర్హులందరికీ తక్షణమే రూ.రెండు లక్షల రుణమాఫీ చేయాలని సీపీఎం మండల కార్యదర్శి ముదిగొండ రాంబాబు డిమాండ్ చేశారు. వీకే.రామవరంలో ఆదివారం నిర్వహించిన పార్టీ గ్రామశాఖ సమావేశంలో పాల్గొన్న ఆయన మాట్లాడారు. ఎన్నికల హామీ మేరకు రైతు ఖాతాల్లో నగదు జమ చేయాలని అన్నారు. సమావేశంలో మాజీ ఎంపీటీసీ పొడియం వెంకటేశ్వర్లు, ఊకంటి రవికుమార్, గౌరి నాగేశ్వరరావు, మాలోతు రావూజా, మాజీ సర్పంచ్ కుంజా భాస్కర్, సోయం కృష్ణ, పొడియం రామ్మూర్తి పాల్గొన్నారు.

### సీపీఎం గ్రామ కార్యదర్శిగా రాజా

**చండ్రుగొండ:** సీపీఎం గ్రామ కార్యదర్శిగా రాయి రాజా రెండోసారి ఎన్నికయ్యారు. ఆదివారం స్థానిక పార్టీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో రాజాను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. పార్టీ మండల కార్యదర్శి ఐలూరి రామిరెడ్డి, పెద్దిని వేణు, విప్పర్ల వెంకటేశ్వర్లు, ఆర్ వెంకటాచారి, శోభన్‌బాబు, వీరభద్రం, మిరియాల మోహన్‌రావు, నాగుల్‌మీరా, అబ్దుల్ రహెమాన్ పాల్గొన్నారు.

# ఆదమరిస్తే.. అంతే!



శివలింగాపురం కట్ట చివరన ప్రమాదకరంగా ఉన్న గుంత

**మణుగూరుటౌన్:** ఇటీవల కురిసిన భారీ వర్షాలు ఎందరో కుటుంబాలను నిరాశ్రయులను చేసింది. అదేవిధంగా కల్వర్టులను సైతం కూల్చివేసింది. ఈ క్రమంలో ముంపు ముగిసి 25 రోజులు గడుస్తున్నా మండల ప్రజలను ఆ ఆనవాళ్లు మాత్రం వీడడం లేదు. బ్రిడ్జిల సమీపంలోని పెద్ద గుంతలు ఏర్పడ్డాయి. అవి దగ్గరగా వచ్చే దాకా కనిపించకపోవడంతో ప్రయాణికులు భయకంపితులవుతున్నారు. ఆగస్టు 31వ రాత్రి ఏకధాటిగా కురిసిన వర్షానికి బ్రిడ్జిలపై నుంచి ఉధృతంగా పారిన వరదకు అక్కడక్కడా రహదారులు ప్రమాదకరంగా మారాయి. నేటికి వాటికి మరమ్మతులు కానీ రక్షణ చర్యలు కూడా తీసుకోకపోవడంతో ప్రయాణికులు ఆయా రహదారుల్లో ప్రయాణించాలంటే జంకుతున్నారు. ఇక చీకటైతే ఆయా వీధుల్లో వీధిలైట్ల కొరతతో సజావుగా ఇంటికి చేరుతామన్న భరోసా కూడా లేకపోవడంతో బిక్కుబిక్కుమంటూ ప్రయాణం సాగిస్తున్నారు. మున్సిపాలిటీ పరిధిలోని శివలింగాపురం కట్ట చివరన వరద ఉధృతి కారణంగా కల్వర్టుకు కుడి భాగంలో పెద్ద గుంత ఏర్పడి ప్రయాణికులకు తీవ్ర ఇబ్బందికరంగా మారింది. అదేవిధంగా కూనవరం బ్రిడ్జి వద్ద నిత్యం కార్మికులు ప్రయాణించే కోడిపుంజుల వాగు బ్రిడ్జికి ఇరువైపులా రోడ్డు కొట్టుకుపోవడంతో కార్మికులు, కాలనీ వాసులు ఆ రహదారి గుండా ప్రయాణించాలంటే భయకంపితులవుతున్నారు. కాస్త ఆదమరిస్తే అంతే సంగతులు అంటూ వాపోతున్నారు. అధికారులు చర్యలు తీసుకుని ఇప్పటికైనా రక్షణ చర్యలు చేపట్టాలని వేడుకుంటున్నారు.

# గ్యారంటీల అమలులో విఫలం



సమావేశంలో మాట్లాడుతున్న ఎన్డీ నాయకులు

**గుండాల:** ఆరు గ్యారంటీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం వాటిని అమలు చేయడంలో విఫలమైందని సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు అవునూరి మధు పిలుపునిచ్చారు. ఆదివారం కాంగ్రెస్ ప్రభుత్వం పథకాల అమలుపై గుండాల మండలంలో జనరల్ బాడీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతు రుణమాఫీ విషయంలో ఎన్నికల ముందు ఎలాంటి ఆంక్షలు లేకుండా అందరికీ మాఫీ చేస్తానని చెప్పి ప్రగల్భాలు పలికి.. నేడు అధికారంలోకి వచ్చాక అనేక ఆంక్షలు షరతులు విధించడం సరైనది కాదన్నారు. ఇల్లు లేని పేదలకు ఇందిరమ్మ ఇళ్లు ఇస్తామని, అర్హులైన వారందరికీ రేషన్ కార్డులు ఇస్తామని, గ్యాస్ పథకాన్ని సబ్సిడీ ద్వారా రూ. 500లకే ఇస్తామని చెప్పి నేటి వరకు ఆ హామీలపై ఊసే ఎత్తడం లేదని ఆయన విమర్శించారు. చదువుకున్న యువకులకు ఉద్యోగ నోటిఫికేషన్లు కూడా ఇవ్వకుండా నిరుద్యోగ సమస్యను పెంచి పోషిస్తున్నారని అన్నారు. ఇచ్చిన సింగరేణి ఉద్యోగాలను పరీక్షలు పెట్టి వాటిని ఆపారని ఇది ఎట్ల న్యాయమో చెప్పాలన్నారు. కార్యక్రమంలో సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా సహాయ కార్యదర్శి గౌని నాగేశ్వర్ రావు, ఇల్లందు డివిజన్ కార్యదర్శి తుపాకుల నాగేశ్వరరావు, ఆల్ ఇండియా ట్రైబల్ ఫోరం జాతీయ కన్వీనర్ ముక్తి సత్యం, న్యూడెమోక్రసీ జిల్లా నాయకులు కొరం సీతారాములు, బట్టు ప్రసాద్, పర్శిక రవి, డివిజన్, మండల నాయకులు పాల్గొన్నారు.

# 'జీనెక్స్ సీడ్స్‌తో అధిక లాభాలు'



క్షేత్ర ప్రదర్శనలో రైతులు, కంపెనీ ప్రతినిధులు

**గుండాల:** జీనెక్స్ సీడ్స్‌తో అధిక లాభాలను పొందవచ్చని ఆ కంపెనీ ఏఎస్ఎం శ్రీపాల్, డీలర్ మానాల వెంకటేశ్వర్లు అన్నారు. మండలంలోని యాపలగడ్డ గ్రామంలో జీనెక్స్ మొక్కజొన్న వేసిన చేన్లలో ఆదివారం రైతు ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఖరీఫ్ సీజన్‌లో ఆయా రైతులు ఈ విత్తనాలను ఎంపిక చేసుకుని అధికారుల, డీలర్స్ సలహాలతో సాగు చేశారని అన్నారు. కంకి పొడవుగా, ఎక్కువ సంఖ్యలో గింజలతో మంచి దిగుబడి వస్తుందన్నారు. ఈరైతు ప్రదర్శన క్షేత్రంలో చుట్టుపక్కల గ్రామాలన నుంచి సుమారు 500 మంది రైతులు పాల్గొన్నారు. కార్యక్రమంలో వ్యమసాని జనార్ధన్, మానాల ప్రభాకర్, తిరుక్కొవళ్లూరి వెంకటేశ్వర్లు, మానాల ప్రణీత్, రాయుడు, జితెందర్, సతీష్‌లు పాల్గొన్నారు.

### గుండాల పీఏసీఎస్‌కు అవార్డ్

**గుండాల:** ఉత్తమ ఎన్‌పీఏ రెడక్షన్ పీఏసీఎస్‌గా గుండాల ఎంపికైంది. ఈ సందర్భంగా ఖమ్మంలో జరిగిన సభలో గుండాల పీఏసీఎస్ చైర్మన్ గొగ్గెల రామయ్య, సీఈఓ రాంబాబులు అవార్డును అందుకున్నారు. సెంట్రల్ బ్యాంక్ చైర్మన్ దొండపాటి వెంకటేశ్వర్లు, డీసీఓ దామోదర్ చేతులమీదుగా ఈ అవార్డును తీసుకున్నారు. 2023–24 ఆర్థిక సంవత్సరానికి గానూ బెస్ట్ ఫర్మామెన్స్‌గా ఎంపిక చేసినట్లు తెలిపారు. ప్రతీ ఏడాది ఇలాగే అవార్డులు తీసుకోవాలని సూచించారు.

### ఆహ్వాన పత్రికలు ఆవిష్కరణ



ఆహ్వానపత్రికలు ఆవిష్కరిస్తున్న ఎస్సై రాజశేఖర్

**ములకలపల్లి:** మండలకేంద్రంలోని ఉమాపృథ్వీ రామలింగేశ్వర స్వామి ఆలయంలో నిర్వహించనున్న దేవీ శరన్నవరాత్రుల ఆహ్వాన పత్రికలను ఎస్సై కిన్నెర రాజశేఖర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆదివారం ఆలయం వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎస్సై పాల్గొని మాట్లాడారు. ప్రశాంత వాతావరణంలో నవరాత్రులు జరుపుకోవాలని ఆకాంక్షించారు. ఆలయకమిటీ ఆధ్వర్యంలో దుశ్శాలువతో ఎస్సై రాజశేఖర్‌ను ఘనంగా సత్కరించారు. ఆలయ కమిటీ చైర్మన్ నరాటి ప్రసాద్, అర్చకులు సురేశ్ శర్మ, సభ్యులు పువ్వాల మంగపతి, బండి కొమరయ్య, శనగపాటి సీతారాములు, పువ్వాల లలితారావు, సంజీవాచారి, కొదుమూరి నర్సింహారావు, తిరుమలేశు, సాయి పాల్గొన్నారు.

### టీపీసీసీ అధ్యక్షుడిని కలిసిన కాంగ్రెస్ మండలాధ్యక్షుడు



మహేష్‌కుమార్ గౌడ్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న వనమా గాంధీ

**అన్నపురెడ్డిపల్లి:** నూతనంగా టీపీసీసీ అధ్యక్షుడిగా ఎంపికైన మహేష్‌కుమార్ గౌడ్‌ను కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు వనమా గాంధీ మర్యాదపూర్వకంగా కలిశారు. ఆదివారం హైదారాబాద్‌లోని మహేష్‌కుమార్ గౌడ్ నివాసంలో ఆయనను కలిసి పుష్పగుచ్ఛం అందించి, శాలువాతో సన్మానించారు. అనంతరం పార్టీ బలోపేతంపై చర్చించినట్లు తెలిపారు.

# శునకాలతో జాగ్రత్త..!

- వీధి కుక్కల్లో విస్తరిస్తున్న డెర్మటైటిస్ వ్యాధి
- ఈ తరహా కుక్కలు కరిస్తే రేబిస్ సోకే ప్రమాదం
- జాగ్రత్తలు పాటించాలంటున్న వైద్యులు



భద్రాచలం రహదారిపై గుంపులుగా స్వైరవిహారం చేస్తున్న వీధి కుక్కలు



డెర్మటైటిస్ సోకిన శునకం..

**భద్రాచలంఅర్బన్:** భద్రాచలం పట్టణంతో పాటు జిల్లాలో వీధి కుక్కల బెడద ఎక్కువయింది. రోడ్లపై గుంపులు గుంపులుగా స్వైర విహారం చేస్తూ ప్రజలను హడలెత్తిస్తున్నాయి. ద్విచక్ర వాహనాలకు అడ్డుపడుతూ రోడ్డు ప్రమాదాలకు కారణం అవుతున్నాయి. ఇళ్ల వద్దకు చేరి ప్రజలను బెంబేలెత్తిస్తున్నాయి. వాటిలో కొన్ని శునకాలు చర్మవ్యాధితో బాధపడుతున్నాయి. అలాంటి శునకాలతో ప్రజలు జాగ్రత్తగా ఉండాలని, కుక్క కాటుకు గురైతే ప్రాణాంతక రేబిస్ వ్యాధి సోకే ప్రమాదం ఉందని వైద్యులు చెబుతున్నారు.

**డెర్మటైటిస్.. సంక్రమించే వ్యాధి**

డెర్మటైటిస్ అనేది అంటువ్యాధి. ఇది సోకిన కుక్కలకు చర్మంపై వెంట్రుకలు పూర్తిగా ఊడిపోతాయి. రక్తం, చీముతో కూడిన పొక్కులు ఏర్పడతాయి. చర్మం మందంగా మారుతుంది. డెర్మటైటిస్ సోకిన కుక్కలు మనుషులకు, పశువులకు తగిలినా చర్మ సంబంధిత వ్యాధి సంక్రమిస్తుంది. మనుషుల్లో కూడా చర్మంపై ఉండే వెంట్రుకలు రాలిపోతాయి. మచ్చలు ఏర్పడి చర్మం మందంగా మారుతుంది. పశువులకు సోకితే వాటి బాహ్య చర్మంపై మచ్చలు ఏర్పడతాయి. వ్యాధి సోకిన కుక్క కరిస్తే రేబిస్ వచ్చే ప్రమాదం ఉంది. ఈ వ్యాధి బారిన పడిన జంతువుల్లో చొంగ కార్చడం, డొక్కలు లోపలకు నొక్కుకుపోవడం, మేత సరిగ్గా తీసుకోకపోవడం వంటి లక్షణాలు కనిపిస్తాయి. సకాలంలో వైద్యం అందించకపోతే ఆ పశువు, లేదా జంతువు మరణిస్తుంది. మనుషుల్లో కూడా దాదాపుగా ఇవే లక్షణాలు కనిపిస్తాయి. రేబిస్ సోకిన పశువులు, కుక్కల చొంగ చేతికి తగిలితే చర్మ గ్రంథుల ద్వారా వ్యాధి బారిన పడే అవకాశం ఉంది.

**జాగ్రత్తలతో నివారణ..**

పెంపుడు జీవాల ద్వారా వచ్చే వ్యాధుల పట్ల పెంపకందారులు పూర్తి అవగాహన కలిగి ఉండాలి. వ్యాధుల నివారణకు కుక్కలకు, పశువులకు, ఇతర జీవాలకు ఎప్పటికప్పుడు వ్యాక్సిన్లు వేయించాలి. ఇటీవల జునోసిస్ డేని పురస్కరించుకుని పశుసంవర్ధక శాఖ అధికారులు జంతు వ్యాధులపై అవగాహన కల్పించడంతోపాటు పెంపుడు కుక్కలు, జంతువులకు టీకాలు వేశారు. టీకాలు వేయిస్తే వాటిలో వ్యాధి నిరోధక శక్తి పెరిగి వ్యాధుల బారిన పడకుండా ఉంటాయి. వ్యాక్సినేషన్ చేయని వీధి కుక్కలు కరవడం వల్ల రేబిస్ సోకే ప్రమాదం అధికంగా ఉంటుంది. ప్రస్తుత వర్షాకాలంలో శునకాలు సంతానోత్పత్తికి యత్నించే క్రమంలో వాటిలో వ్యాధులు విస్తరించే అవకాశం ఉంది. కుక్క కాటుతో అలాగే ఇతర జంతువుల వల్ల మనుషులకు సంక్రమించే వ్యాధుల పట్ల ప్రజలు పూర్తి అవగాహన పెంచుకోవడం ద్వారా వ్యాధుల బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవచ్చు.

### కుక్కలతో జాగ్రత్తగా ఉండాలి



ప్రస్తుత సీజన్లో కుక్కలతో జాగ్రత్తగా ఉండాలి. ముఖ్యంగా కెనాస్ మెంజు (డెర్మటైటిస్) వ్యాధి బారిన పడిన శునకాలతో ప్రమాదం. వీధి కుక్కల్లో పరన్న జీవుల కారణంగా వస్తుంది. బహిరంగ ప్రదేశాల్లో కనిపించే ఈ తరహా కుక్కలకు దూరంగా ఉండాలి. ఇవి తిండి తినలేక, చొంగ కార్చుతుంటాయి. వీటికి రేబిస్ ఉండే అవకాశం ఎక్కువగా ఉంది. క్షేత్ర స్థాయిలో వీటిపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాం. ముఖ్యంగా పిల్లలు వీటి బారిన పడకుండా తగు జాగ్రత్తలు పాటించాలి. ఇటు వంటి కుక్క కాటుకు గురైతే తక్షణమే వైద్య సేవలు పొందాలి. ఈ వ్యాధిబారిన పడిన జీవాలకు 10 ఎంజీ ఐవర్మెక్టిన్ ట్యాబ్లెట్లను వాడితే ప్రయోజనం ఉంటుంది.

– డాక్టర్ రవీంద్రనాథ్ ఠాగూర్, ఇన్‌చార్జ్ ఏడీఏ, భద్రాచలం